www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 30 సెప్టెంబరు 2024
5
ఏలూరు



హీల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ఆగిరిపల్లి : సిబిఎస్ఇ క్లస్టర్ సెవెన్ ఖోఖో-2024 పోటీల్లో మండల పరిధిలోని తోటపల్లి హీల్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 22 నుండి 25వ తేదీ వరకు హైదరాబాద్‌లోని బాచుపల్లిలో జరిగిన సిబిఎస్ఇ సెవెన్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో హీల్ విద్యార్థులు ప్రథమ, తృతీయ స్థానాలు సాధించినట్లు ప్రిన్సిపల్ బి.సాయిబాబు తెలిపారు. ఈ పోటీల్లో అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలల్లో మొత్తం 244 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా అండర్-14 విభాగంలో హీల్ స్కూల్ బాలికలు ప్రథమ బహుమతి సాధించగా, బాలురు తృతీయ బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా హీల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, ఫెసిలిటిస్ డైరెక్టర్ టి.భాస్కర్, సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్, ఎడ్యుకేషనల్ కమిటీ సభ్యులు ఎం.మణికుమారి, ఎం.హరీష్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్స్ ఎస్.నాగరాజు, సిహెచ్.దాసు, శ్రీనివాసరెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

పెట్టుబడి సాయం.. రూ.20 వేలు ఎప్పుడు..!



కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అసలు ఇస్తుందా.. ఖరీఫ్ ముగిసే దశకు చేరుతున్నా.. పెట్టుబడి సాయంపై ప్రభుత్వం ఎందుకు మాట్లాడం లేదు.. దీనికి సంబంధించిన విధి విధానాలను ఇప్పటివరకూ ఎందుకు ప్రకటించలేదు.. సాగుకు అవసరమైనప్పుడు ఇవ్వకుండా తర్వాత ఇస్తే ప్రయోజనం ఏంటన్న చర్చ జిల్లా రైతాంగంలో విస్తృతంగా కొనసాగుతోంది. ప్రభుత్వం వెంటనే అన్నదాత సుఖీభవ కింద అందించే పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులపైనే
ఖరీఫ్ సాగుకు అందని పెట్టుబడి సాయం
రెండు జిల్లాల్లో 2.50 లక్షల మంది రైతులు ఎదురుచూపు
అన్నదాత సుఖీభవ అమలుపై రైతుల్లో చర్చ
కౌలురైతులకు రుణాలు లేవు.. సాయం లేదు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగు ప్రారంభించి 70 రోజులు దాటిపోయింది. వరిపొలాలు పొట్టదశకు చేరుతున్నాయి. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద అందిస్తామని చెప్పిన పెట్టుబడి సాయం ఇప్పటికీ అందించలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు పెద్దఎత్తున పెట్టుబడి అవసరం. ఇటువంటి తరుణంలో అందించకపోవడంపై రైతుల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. గత ప్రభుత్వం కేంద్రం ఇచ్చే రూ. ఆరు వేలతో కలిపి రైతు భరోసా సాయం కింద ఏటా రూ.13,500 చొప్పున రైతులకు అందించేది. కేంద్ర ప్రభుత్వం మూడు విడతలుగా రూ.ఆరు వేలు, రాష్ట్ర ప్రభుత్వం మే చివరి వారంలో మొదటి విడతగా రూ.5,500, జనవరిలో రెండో విడతగా రూ.రెండు వేలు, రైతు భరోసా సొమ్ము జమచేసేది. గత ప్రభుత్వ హయాంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో రైతుభరోసా సాయం అందుకున్న రైతుల సంఖ్య 2.50 లక్షల మందికి పైగా ఉన్నారు. ఎన్నికల్లో భాగంగా టిడిపి కూటమి తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేలు అందిస్తామని రైతులకు హామీ ఇచ్చింది. దీంతో రైతులు గంపగుత్తగా కూటమి పార్టీలకు ఓట్లు వేసి గెలిపించారు. కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ కింద రైతులకు అందించే మొదటి విడత సొమ్మును జూన్‌లోనే విడుదల చేసింది. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం మాత్రం ఇప్పటికీ చిల్లిగవ్వ రైతులకు అందలేదు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటేసింది. ఇప్పటికీ పెట్టుబడి సాయం ఎన్ని విడతలుగా ఇస్తారు. ఎప్పుడు ఇస్తారన్న సమాచారం కూడా ప్రభుత్వం చెప్పడం లేదు. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులు ఎకరాకు రూ.20 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. ఇంకా పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టాల్సి ఉంది. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తే ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఆ ఊసే ఎత్తడం లేదు. గతంలో రుణమాఫీకి సంబంధించి సైతం టిడిపి ప్రభుత్వం అనేక పిల్లి మొగ్గలు వేసింది. దీంతో ఇప్పుడు పెట్టుబడి సాయం అందజేతపై రైతుల్లో అనేక అపోహలు నెలకొన్నాయి. ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

పంట రుణాలు లేవు.. పెట్టుబడి సాయమూ లేదు

రెండు జిల్లాలో మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. జిల్లాలో వ్యవసాయ సాగు చేస్తున్నది 70 శాతంపైగా కౌలురైతులే. గత ప్రభుత్వ హయాంలో కౌలురైతుల పరిస్థితి దయనీయాంగా మారింది. కౌలు కార్డులు, పంట రుణాలు అరకొరగా అందించి చేతులు దులుపుకుంది. రైతు భరోసా సాయం సైతం కౌలురైతులకు అందని పరిస్థితి నెలకొంది. దీంతో కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుని ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. తాము అధికారంలోకి వస్తే కౌలు రైతులను ఆదుకుంటామంటూ టిడిపి కూటమి చెప్పింది. కూటమి అధికారం చేపట్టడంతో కౌలురైతులు తమకు పంట రుణాలు, పెట్టుబడి సాయం అందుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కౌలుకార్డుల జారీప్రక్రియలో గానీ, పంటరుణాల మంజూరులో గానీ కౌలురైతులకు న్యాయం జరగలేదు. ప్రభుత్వం అందిస్తామన్న పెట్టుబడి సాయమూ అందలేదు. దీంతో కౌలురైతులు పెట్టుబడుల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలని అంతా కోరుతున్నారు.



వాటర్‌వర్క్స్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ, మంత్రి నిమ్మల

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర బడ్జెట్ లోటులో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి నిధుల కొరత లేదని, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ఆదివారం తొలిసారిగా అడుగుపెట్టిన మంత్రి నారాయణ జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో పరిశీలించారు. మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్, హిందూ బర్రెల్ గ్రౌండ్, డంపింగ్ యార్డు, అబ్దుల్ కలాం హెల్త్ పార్క్, నారా చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, ఎన్‌టిఆర్ కళాక్షేత్రం, అన్నా క్యాంటీన్, ఎన్‌టిఆర్ టిడ్కో ఇళ్ల సముదాయాలను పరిశీలించారు. మంత్రి నిమ్మల రామానాయుడు పాలకొల్లు పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ పనులను తదితర విషయాలను మంత్రి నారాయణకు వివరించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని నారాయణ సూచించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆర్‌డిఒ దాసిరాజు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ బి.విజయ సారథి, నాయకులు ఉన్నారు.

మంత్రి నారాయణకు ఘన స్వాగతం

పాలకొల్లులో ఆదివారం అభివద్ధి పనులు పరిశీలనకు వచ్చిన మంత్రి పి. నారాయణ కు ఘన స్వాగతం లభించింది. ముందుగా బ్రాడీపేట మున్సిపల్ వాటర్ వర్క్స్ నకు చేరుకున్న ఆయనకు మంత్రి నిమ్మల రామానాయుడు శాలువా కప్పి గజమాల వేసి సత్కరించారు. కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పూలమాలలు వేశారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీని ఉపయోగించండి

అభివృద్ధి పనుల్లో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. స్థానిక పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశ మందిరంలో మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులతో మంత్రి పి.నారాయణ పాలకొల్లు అభివృద్ధి పనులపై సమీక్షించారు. పట్టణంలో మిగిలి ఉన్న వివిధ అభివృద్ధి పనులు, తాగునీరు, రహదారులు, డ్రెయినేజీలు, శానిటేషన్, తదితర అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి నారాయణకు నిమ్మల రామానాయుడు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ పాలకొల్లులో టిడ్కో గృహాలు పూర్తి చేయడంతో పాటు, పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించి నిరుపేదలందరికీ సొంతింటికల నిజం చేస్తామన్నారు. హాస్పటల్, అంగన్వాడీ సెంటర్లు, షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో తాగునీరు, డ్రెయినేజీ, శానిటేషన్, వీధిలైట్లపై దృష్టి పెడితే ప్రజలు సంతృప్తి చెందుతారని అధికారులకు మంత్రి తెలిపారు. పారిశుధ్యం మెరుగుదలకు స్వీపింగ్ యంత్రాలను విరివిగా వాడాలన్నారు. ప్రతి నియోజకవర్గానికీ ఒక అన్నా క్యాంటీన్ తప్పనిసరిగా ఉండాలని, జిల్లాలో ఉండి, ఆచంట నియోజక వర్గాలకు అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు సి.నాగారాణికి మంత్రి సూచించారు. పాలకొల్లు పురపాలక సంఘానికి అవసరమైన నిధులు సమకూర్చి, వచ్చే నెలలో శంకుస్థాపనకు వస్తానని తెలిపారు. జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు పట్టణానికి అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలనకు ఆహ్వానించగా వచ్చినందుకు మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలిపారు. ఐదేళ్ల గత ప్రభుత్వ పాలనలో 20 సంవత్సరాలు రాష్ట్రం వెనక్కి వెళ్లిందన్నారు. 40 వేలు జనాభాకు తగ్గట్టుగా తాగునీటి సరఫరా ఉందని, ప్రస్తుత జనాభాకు అనుగుణంగా తాగునీటి చెరువులు, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. టిడ్కో గృహాలు పూర్తిస్థాయిలో గృహప్రవేశాలు జరిగితే పట్టణానికి అయిదు నుండి ఆరు వార్డులు పెరుగుతాయన్నారు. అందుకు తగ్గట్టుగా నిధులు, మున్సిపల్ సిబ్బంది పోస్టులు మంజూరు చేయాలన్నారు.

ఎస్‌డిసి తీర్పులను రద్దుచేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కెఆర్‌పురం ఐటిడిఎ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనుకుమార్ ఎల్‌టిఆర్ భూములపై ఇచ్చిన తీర్పులపై సమగ్ర విచారణ జరిపి ఏకపక్షంగా ఇచ్చిన తీర్పులను రద్దుచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ పేర్కొన్నారు. ఎల్‌టిఆర్ కేసుల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇచ్చిన తీర్పులు అంతిమం కాదని, అభ్యంతరాలుంటే హైకోర్టుకు వెళ్లొచ్చంటూ కెఆర్.పురం ఎస్‌డిసి జి.శ్రీనుకుమార్ పత్రికలకు వివరణ కింద ఇచ్చిన తీరును సిపిఎం జిల్లా కమిటీ ఖండిస్తోందంటూ ఎ.రవి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌డిసి గిరిజనేతరులు ఇచ్చిన లంచాలకు కక్కుర్తిపడి తప్పుడు తీర్పులిచ్చి కావాలంటే హైకోర్టుకు వెళ్లొచ్చని చెప్పడం అహంకారపూరితమని పేర్కొన్నారు. ఎస్‌డిసికు గిరిజనులు అంటే ఏమాత్రమూ లెక్కలేనితనం కనిపిస్తోందని తెలిపారు. తాంబూలాలు ఇచ్చేశాం తన్నుకు చావండి అన్నట్టు ఆయన ఏకపక్షంగా తప్పుడు తీర్పులిచ్చి కావాలంటే హైకోర్టుకు వెళ్లమని ఉచిత సలహాలు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన తీర్పులపై విచారణ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సిపిఎం సవాల్ విసురుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో గిరిజనులకు న్యాయ సహకారం కోసం ప్రభుత్వం డబ్బులు ఇచ్చేదని పదేళ్లుగా ఈ పద్ధతి ఎత్తేశారని గుర్తుచేశారు. పేదలైన గిరిజనులు ఎస్‌డిసి ఇచ్చిన తప్పుడు తీర్పులపై హైకోర్టుకు ఎలా వెళ్లగలుగుతారని ప్రశ్నించారు. శ్రీనుకుమార్ తన అహంకార పూరిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని శ్రీనుకుమార్ ఇచ్చిన తీర్పులపై సమగ్ర విచారణ జరిపి ఏకపక్షంగా ఇచ్చిన తీర్పులు రద్దు చేయాలని రవి డిమాండ్ చేశారు.

కోర్సవారిగూడెంలో బడి పునఃప్రారంభించాలి

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని కోర్సవారిగూడెంలో బడి పునఃప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మండలంలోని కోర్సవారిగూడెంలో బడి పిల్లలు తల్లిదండ్రులతో పాఠశాల సమస్యపై మాట్లాడారు. అనంతరం పాత మూసివేసిన పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, మండలాధ్యక్షులు కారం భాస్కర్ మాట్లాడుతూ కోర్సవారిగూడెం పంచాయతీ కేంద్రంలో 2010-11 సంవత్సరంలో విద్యార్థులు లేరని బడిని మూసివేశారన్నారు. ప్రస్తుతం పెద్ద కోర్సవారిగూడెం, చినకోర్సవారిగూడెం గ్రామంలో సుమారు 25 మంది చిన్నారులు ఉన్నారన్నారు. వీరంతా దూర ప్రాంతంలోని ఇనుమూరు, గవరంపేట, గురుగుమిల్లి పందిరిమామిడిగూడెం గ్రామాల్లో ఉన్న పాఠశాలకు వెళ్తున్నారన్నారు. ఆ చిన్నారులను ఉదయం సాయంత్రం తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆయా పాఠశాలలకు తీసుకెళ్తున్నారన్నారు. అప్పుడు బడిలో పిల్లలు లేరనే సాకుతో ఎంపిపి స్కూల్‌ను మూసివేశారని, రెండు గ్రామాలలో బడి లేదన్నారు. మూసివేసిన బడిని పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోని గ్రామంలో బడిని ప్రారంభించకపోతే విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాలతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె.గాంధీ, ముత్యాలు, సోమిరెడ్డి పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

ప్రజాశక్తి - పోలవరం

అల్పపీడన ప్రభావంతో ఎగువ రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతూ వస్తోంది. ఆదివారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం పెరగడంతో పోలవరం ప్రాజెక్టు స్పిల్వే నుంచి 2,86,205 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువున 28.700 మీటర్లు స్పిల్వే దిగువున 18.900 మీటర్లు నీటి మట్టం నమోదైనట్లు ఇఇ మల్లికార్జునరావు తెలిపారు. ఎల్లండిపేట కొవ్వాడ రిజర్వాయర్ వద్ద నీటిమట్టం 90.05 మీటర్లు నమోదైందని, 150 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్లు రిజర్వాయర్ సిబ్బంది సత్యన్నారాయణ తెలిపారు.

రఘురామకృష్ణంరాజును అరెస్ట్ చేయాలని ర్యాలీ

ప్రజాశక్తి - కలిదిండి



ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

కాళ్ల మండలం ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించిన ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ కలిదిండి ప్రధాన సెంటర్ నుండి పోలీస్ స్టేషన్ వరకూ దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రఘు రామకృష్ణంరాజుపై ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. ఎంఎల్‌ఎను అరెస్ట్ చేయకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మాల మహానాడు మండల అధ్యక్షులు బోడిగడ్డ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ముంద్రు శామ్యూల్ రాజు, దళిత సంఘాల నాయకులు ఈదా పద్మారావు, యాళ్ల జీవరత్నం, కంచర్ల సురేష్, ముంద్రు ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

రూ.15 కోట్లతో వంతెన నిర్మాణం

శనివారపుపేట కాజ్‌వే స్థానంలో

ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు

రూ.15 కోట్లతో శనివారపుపేట కాజ్ వే స్థానంలో నూతన వంతెన నిర్మిస్తామని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. పనిచేసే ఎంపీ మహేష్‌కుమార్, ఎంఎల్‌ఎ బడేటి చంటిలు ప్రజాప్రతినిధులుగా రావటం ఏలూరు ప్రజల అదృష్టమని కాపు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీరాములు అన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన విజయోత్సవం ఏలూరు రాయల్ స్టార్ ఫంక్షన్ హాలులో పులి శ్రీరాములు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ తమ తాత, తండ్రి చేసిన అభివృద్ధిని రానున్న ఐదేళ్లలో పూర్తి చేస్తామన్నారు. ఇటీవల జరిగిన వరదల వల్ల నష్టపోయిన వారికి ఏలూరు వాసులు ఒక కోటి రూపాయల విరాళం అందించారన్నారు. త్వరలోనే రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేయిస్తామన్నారు. కాపు సంక్షేమ సేవా సంఘం తరపున జిల్లా అధ్యక్షులు పూజారి నిరంజన్ రూ.50 వేల చెక్కును అన్నా క్యాంటీన్ల కోసం ఎంఎల్‌ఎ బడేటి చంటికి అందించారు. రామకృష్ణప్రసాద్ రూ.పది వేల చెక్కును అందించారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పంపిన సందేశాన్ని పులి శ్రీరాములు సభ్యులకు తెలిపారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వంద రోజుల్లో సాధించిన ప్రగతిని పులి శ్రీరాములు తెలిపారు. వర్జీనియా పొగాకు రైతులకు రూ.110 కోట్ల లబ్ధి, పోలవరానికి రూ.12,500 కోట్లు, ఏలూరుకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ హాల్టు, జాబ్‌మేళాతో 566 మందికి ఉద్యోగాలు, పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర సాధించారన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యునిగా నియమితులైన కానాల రామకృష్ణ, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, డిప్యూటీ మేయర్‌గా ఎంపికైన కర్రి శ్రీనివాసరావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోటేపల్లి చంద్రశేఖర్, వాసా రాజు, గాదం వెంకట రామకృష్ణ, సామర్ల వెంకటేశ్వరరావు, కురెళ్ల భాస్కరరావు, బడే సతీష్ నాయుడు, నిమ్మల జ్యోతికుమార్, సాయి, పాటే రాంబాబు, లింగిశెట్టి శశికుమార్, నడపన దానభాస్కర్, వీరంరెడ్డి రమేష్, రావూరి మోహన్ దుర్గా నాయుడు, ఎంపీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు కాకి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన భూములను అక్రమంగా దొంగ సర్టిఫికెట్లు సృష్టించి గిరిజనేతరులకు కట్టబెట్టేలా ఆన్‌లైన్‌లో మార్పులు చేస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీలుగుమిల్లి మండలంలోని చంద్రమ్మ కాలనీలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలను అమలు చేసే అధికారులే చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని, కంచె చెను మేసే చందాగా రెవెన్యూ వ్యవస్థ తయారైందని విమర్శించారు. వారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆదివాసీల తరపున ఆందోళనకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు పుణెం వెంకటేశ్వరరావు, రవ్వ బసవరాజు, కార్యవర్గ సభ్యులు పండు రాజేంద్ర, పండు జగదీష్, నారం శంకర్, తెల్లం ప్రసాద్ పాల్గొన్నారు.

సిఆర్‌ఎంటిల్లో ఆందోళన

స్కూల్ కాంప్లెక్స్ కుదింపు నిర్ణయంపై ఆవేదన
విధుల నుంచి తొలగిస్తారేమోనని భయం
13 ఏళ్లుగా తక్కువ వేతనానికి పని చేస్తున్నా
రెగ్యులర్‌కు నోచుకోని వైనం
తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు



ప్రజాశక్తి - దెందులూరు

జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా మండలాల్లో స్కూల్ కాంప్లెక్స్‌లను కుదిస్తుండడంపై క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్ (సిఆర్‌ఎంటీ)లలో ఆందోళన వ్యక్తమవుతోంది. స్కూల్ కాంప్లెక్స్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఇప్పటివరకు మండలాల్లో ఉన్న స్కూల్ కాంప్లెక్సును మరింత తగ్గించే ప్రయత్నాలను విద్యాశాఖాధికారులు చేపట్టారు. ఈ స్కూల్ కాంప్లెక్సు కుదింపు వల్ల ఇప్పటివరకు క్లస్టర్ ప్రాతిపదికన బిఇడి విద్యార్హతతో నియమితులైన సిఆర్‌ఎంటి పోస్టులు ఎక్కడ గల్లంతవుతాయోనన్న ఆందోళన వారిలో నెలకొంది. జిల్లాలో అనేక పాఠశాలల్లో సమగ్ర శిక్ష విభాగంలో గత 13 ఏళ్లుగా వీరంతా స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో తొలుత సిఆర్‌పిలుగా, ఆ తర్వాత సిఆర్‌ఎంటిలుగా వ్యవహరిస్తూ విద్యాశాఖ నిర్వహించే అనేక కార్యక్రమాల్లో సేవలందిస్తున్నారు. ఒక పక్క ఉపాధ్యాయుడిగా, మరోవైపు విద్యా కార్యక్రమాలు అమలు చేసే సిబ్బందిగా రెండు రకాల సేవలందిస్తున్న ఈ సిఆర్‌ఎంటిలు విద్యావ్యవస్థలో కీలకంగా మారారు. మండలస్థాయిలో ఎక్కడైనా ఏకోపాధ్యాయుడు సెలవు పెడితే ఆ పాఠశాల మూతపడకుండా వీరు ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడిగా సేవలందించడంతో పాటు, పాఠశాలలు, విద్యాశాఖకు వారధిలా సమన్వయం చేసుకుంటూ, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఆరు నుంచి 14 ఏళ్లలోపు బడి బయట విద్యార్థులను గుర్తించి వారిని స్కూళ్లలో చేర్పించడం, ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే స్కూల్ కిట్లు పాఠశాలలకు చేరవేయడం దగ్గర నుంచి అవి విద్యార్థులకు అందేలా చూడడం వరకూ వీరిదే బాధ్యత. ఇక స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణలో భాగస్వాములు కావడంతో పాటు పాఠశాల మధ్యాహ్న భోజన పథక పరిధిలో విద్యార్థుల హాజరు నమోదు, నాణ్యత పరిశీలన వంటి పనులు పూర్తిగా వీరే నిర్వహిస్తున్నారు. స్కూల్ పరంగా విద్యావ్యవస్థలో విద్యాశాఖ కార్యాలయానికి, ఉపాధ్యాయులకు మధ్య అనుసంధానంగా ఈ సిఆర్‌ఎంటిలు వ్యవహరిస్తున్నారు.

13 ఏళ్లుగా సేవలు.. ఏదీ రేగులైజేషన్

స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఈ సిఆర్‌ఎంటిలు నెలకు రూ.23,500 వేతనంతో పని చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 120 మంది వరకు సిఆర్‌ఎంటిలు పని చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వేతనాలు పెంచాలని ఆందోళన చేసినా, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరగా, అప్పటి ప్రభుత్వం అన్ని వివరాలు తీసుకుని రెగ్యులర్ చేయకుండా మోసం చేసింది. వీరికి ఎలాంటి న్యాయం జరగలేదు. తాజాగా స్కూల్ కాంప్లెక్స్ కుదింపు వల్ల తమ ఉద్యోగాలను ఎక్కడ తీసివేస్తారోనన్న ఆందోళన వీరిని వెంటాడుతుంది. తక్కువ వేతనం అయినప్పటికీ స్థానికంగా ఉండడం వల్ల ఏదో విధంగా వీరంతా ఆయా మండలాల పరిధిలో ఉద్యోగాలు చేస్తూ గత 12 సంవత్సరాలుగా తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. స్కూల్ కాంప్లెక్స్ కుదింపుతో వీరిని తొలగించడం, మరో చోటకు బదిలీ చేయడం చేస్తే ఈ తక్కువ వేతనాలతో తమ కుటుంబ పోషణ ఎలా అని వీరంతా ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమ సమస్యను మానవీయ కోణంలో ఆలోచించి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి
కమలాకర్, సిఆర్‌ఎంటిల జిల్లా నాయకుడు

ఏళ్ల తరబడి విద్యాశాఖలో తక్కువ వేతనాలతో సేవలందిస్తున్న తమకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. బిఇడి విద్యార్హత కలిగిన తామంతా ఇతర అవకాశాలు కూడా వదులుకుని ఈ ఉద్యోగాలనే నమ్ముకుని పనిచేస్తున్నాం. ఇప్పుడు స్కూల్ కాంప్లెక్సు కుదించాలని తీసుకున్న నిర్ణయం వల్ల మా ఉద్యోగాలు ఉంటాయో లేదో తెలియని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం మా సమస్యను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించే దిశగా భరోసా ఇవ్వాలి.

అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అసంఘటిత కార్మికులకు వివిధ ఆర్థిక ప్రయోజనాలతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని హాజరైన ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్ద వెంకట్రావు డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వర్కర్స్ యూనియన్ సమావేశం స్థానిక జాబిల్లి ఫంక్షన్ హాలులో ఆదివారం యూనియన్ ఏలూరు జిల్లా ప్రెసిడెంట్ కాళ్ల దివాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన బద్ద వెంకట్రావు మాట్లాడుతూ దశాబ్దాలుగా అసంఘటిత రంగ కార్మికులకు వివిధ ఆర్థిక ప్రయోజనాలతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పోరాడుతున్నారన్నారు. ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఏలూరు బహిరంగ సభ సాక్షిగా అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వర్కర్స్ యూనియన్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పామర్తి సత్యనారాయణ మాట్లాడుతూ యూనియన్ సభ్యులంతా ఐకమత్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు యూనియన్ ప్రెసిడెంట్ శిలా రామకృష్ణ, చింతలపూడి యూనియన్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, ఇతర యూనియన్ నాయకులు సాంబశివరావు, తివారి బాలాజీ, సుధీర్, తదితరులు నాయకత్వం వహించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - కుక్కునూరు

మహిళా సమితి ఆధ్వర్యంలో శనివారం సీతారామనగరంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నోటు పుస్తకాలు, పెన్నులు, క్యారం బోర్డులు, క్రికెట్ కిట్స్ ఉచితంగా అందించారు. అలాగే ఐటిసి బిఎంఎస్ భద్రాచలం మహిళా సమితి ఆధ్వర్యంలో పిల్లలకు ఆట స్థలం, పాఠశాల విద్యార్థులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తామని బిఎంఎస్ మహిళా సెక్రటరీ రేష్మా శర్మ తెలిపారు. మంచిగా చదువుపై శ్రద్ధ పెట్టి చదివే పేద విద్యార్థులకు భవిష్యత్తులో అనేక సౌకర్యాలు కల్పిస్తామని ఐటిసి(బిఎంఎస్)సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ మహిళా సెక్రటరీ రేష్మి శర్మ, సభ్యులు లక్ష్మీ రాంబాబు, అల్కా ప్రఫుల్, శైలజ, ఐటిసి ఉద్యోగి శేషు, బొల్లా రాజేష్, పాఠశాల ఉపాధ్యాయులు రఘుకుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

'మానవత' సేవల అమలుకు ప్రణాళికలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మానవత సంస్థ ఉంగుటూరు మండల కమిటీ ద్వారా వచ్చే నెలలో వైద్య శిబిరం నిర్వహణ, సభ్యత్వాల పెంపు కార్యక్రమాల అమలుకు ప్రణాళికలు వేస్తున్నామని మండలాధ్యక్షుడు వేగేశ్న రంగరాజు అన్నారు. రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపీ ముఖ్యఅతిథిగా ఆదివారం నిర్వహించిన నెలవారీ సమావేశంలో కార్యాచరణపై తీర్మానించామన్నారు. మానవత డైరెక్టర్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పూర్వపు అధ్యక్షుడు విష్ణుమూర్తి, ఉపాధ్యక్షుడు కోనే సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు నేదూరి గంగాధరరావు, గురువెల్లి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సిఎ విద్యార్థినికి 'మానవత' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మండవల్లి

ఆర్థిక పరిస్థితులు చదువుకు ఆటంకం కలిగించడంతో ఇబ్బందులు పడుతున్న సిఎ విద్యార్థికి మానవత స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహాయం చేసి దాతృత్వాన్ని చాటుకుంది. మండవల్లి మండలం గన్నవరం గ్రామానికి చెందిన మండపాటి లక్ష్మీ శరణ్య మాస్టర్ మైండ్ నిర్వహించిన సిఎ అర్హత పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. అయితే సిఎ చదివేందుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఆ విద్యార్థిని ఏం చేయలో తెలియక సతమతమవుతోంది. దీంతో లక్ష్మీ శరణ్య తల్లిదండ్రులు మానవత స్వచ్ఛంద సంస్థ మండలాధ్యక్షులు గుడివాడ విజయ గణేష్ కుమార్ సంప్రదించారు. దీంతో ఆయన స్వచ్ఛంద సంస్థ జిల్లా ఛైర్మన్ నర్సిమిల్లి నిర్మలకు విషయం తెలిపారు. వెంటనే స్పందించిన ఆమె నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రయివేట్ సంస్థ ఎండి అడుసుమిల్లి సుబ్రహ్మణ్యానికి విషయాన్ని తెలిపారు. దీంతో ఆయన వెంటనే స్పందించి రూ.1.75 లక్షలు కాలేజీ యాజమాన్యానికి చెక్కు రూపంలో పంపించారు. లక్ష్మీ శరణ్యకు విద్యకు ఆర్థిక సహాయం అందించిన విద్యాదాతకు స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షురాలు నిర్మలకు, మండల శాఖ సభ్యులు కొండ్రెడ్డి సత్యనారాయణకు, మండలాధ్యక్షులు విజయ గణేష్ కుమార్‌కు స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

2న జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులను అక్టోబర్ రెండో తేదీన ఏలూరులో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అధ్యయన తరగతుల్లో రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు -విద్యారంగంపై ప్రభావం, విద్యారంగ సమస్యలు, ఎపిటిఎఫ్ దృక్పథం-పని విధానం అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయన్నారు. ఈ అధ్యయన తరగతులకు వక్తలుగా ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హెచ్.మంజుల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బి.వి.సాల్మన్‌రాజులు పాల్గొంటారని తెలిపారు.

గుండె జబ్బులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - దెందులూరు

ప్రపంచ హృదయ దినోత్సవాన్ని దెందులూరులోని బిఆర్‌డి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ హృదయ దినోత్సవం గురించి మూడో సంవత్సరం చదువుతున్న నిషా, రెండో సంవత్సరం చదువుతున్న ప్రమీలరాణి వివరించారు. విద్యార్థులకు హృదయం గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 29న జరుపుకుంటారని వారు తెలిపారు. ఈ దినోత్సవం ప్రపంచ ఆరోగ్య సంస్థ, వరల్డ్ హార్ట్ ఫెడరేషన్లు సంయుక్తంగా నిర్వహిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ గుండె జబ్బులపై అవగాహన పెంచుకుని, గుండె జబ్బులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవాలన్నారు. గుండెపోటు, గుండె జబ్బులను నివారించడం కోసం 1946లో జెనీవా దేశంలో వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సమస్త ఏర్పాటైందని వారు తెలిపారు. 1999లో అప్పటి వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ తొలిసారిగా ఈ దినోత్సవాన్ని జరిపారని, అలా 2000 నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రారంభించినట్లు చెప్పారు. గుండె బాగుండాలంటే నూనె పదార్థాలు ఎక్కువగా తీసుకోకూడదన్నారు. మన బరువును కూడా సరిగ్గా మెయింటైన్ చేయాలని వివరించారు. అధిక ఒత్తిడికి గురవ్వకూడదని, నిల్వ పదార్థాలు తినకూడదని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

సరిహద్దు విషయమై దాడి

ముదినేపల్లి :ఇంటి సరిహద్దు విషయమై రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణ దాడికి దారి తీసిన సంఘటన ఆదివారం మండలంలోని పెదకోమరు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు వేములవాడ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. .వేములవాడ నాగరాజు పెదకోమ్రులో పాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం పాస్టర్ భార్య మార్తమ్మ ఇంటి ఆవరణలో కోడి పిల్లలకు మేత వేస్తుండగా ఇంటి ఎదురుగా ఉన్న శీలం శ్రీదేవి నా వైపు ఎందుకు చూస్తున్నావ్ అంటూ మార్తమ్మపై ఘర్షణకు దిగింది. బయట కేకలు వినబడటంతో ఇంట్లో ఉన్న పాస్టర్ నాగరాజు బయటికు వచ్చి చూడగా భార్య మార్తమ్మను శ్రీదేవి దుర్భాషలాడుతుంది. ఎందుకు నా భార్యపై గొడవ పడుతున్నవంటూ పాస్టర్ నాగరాజు శ్రీదేవిని ప్రశ్నించాడు. దీంతో శ్రీదేవితోపాటు నరసయ్య, గని, సుబ్బారావు గడ్డపలుగు, కర్రతో తమపై దాడి చేసినట్లు బాధితులు నాగరాజు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘర్షణలో భార్యాభర్తలిద్దరికీ గాయాలయ్యాయి. దీంతో భార్యాభర్తలు ఇంట్లోకి పారిపోయి తలుపులు వేసుకున్నారు. అనంతరం నాగరాజు భార్య మార్తమ్మను గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి - చింతలపూడి

జిల్లాస్థాయి పోటీలకు నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాల బాలికలు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎం.బ్రాహ్మణేశ్వరమ్మ తెలిపారు. ఏలూరు జిల్లా 2024 - 2025 విద్యా సంవత్సరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తణుకు, ఏలూరు, పెదవేగి, జంగారెడ్డిగూడెంలో జరిగిన ఆటపోటీల్లో నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాల బాలికలు అండర్ -17 యోగా పోటీలో ఇద్దరు, అండర్ -14 యోగా పోటీల్లో ఇద్దరు, అండర్ -17 బ్యాడ్మింటన్‌లో ఒకరు, అండర్ - 14 బ్యాడ్మింటన్‌లో ఇద్దరు, అండర్ -14 200 మీటర్స్ రన్నింగ్‌లో ఫస్ట్ ప్లేస్, అండర్-14 600 మీటరు రన్నింగ్‌లో ఫస్ట్ ప్లేస్, అండర్ -17 షాట్ పుట్ సెకండ్ ప్లేస్, అండర్ -14 లాంగ్ జంప్ ఫస్ట్, సెకండ్ ప్లేస్, అండర్ - 14 హైజంప్‌లో ఫస్ట్, సెకండ్ ప్లేస్, అండర్ - 19 సాఫ్ట్ బాల్‌లో నలుగురు, అండర్ -19 బేస్‌బాల్‌లో నలుగురు, అండర్-19 200 మీటర్ రన్నింగ్‌లో సెకండ్ ప్లేస్, అండర్ -19 హై జంప్‌లో సెకండ్, థర్డ్ ప్లేస్, అండర్ -17 సాఫ్ట్ బాల్‌లో ఇద్దరు, అండర్ -17 బేస్‌బాల్‌లో ఒక్కరు మొత్తం తమ స్కూల్ నుంచి 34 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పిఇటి బాలభారతిని నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బ్రాహ్మణేశ్వరమ్మ, టీచర్ కె.లక్ష్మీకుమారి, ఎటిపి జె.అనిల్‌కుమార్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

టిడిపికి రాంబాబు సేవలు మరువలేనివి

ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని మర్లపాలెంలో టిడిపిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిన వెల్ది రాంబాబు మృతి చాలా బాధాకరమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఆదివారం మధ్యాహ్నం రాంబాబు పెదకర్మ కార్యక్రమంలో ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకరరావు పాల్గొన్నారు. రాంబాబు చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. రాంబాబు జ్ఞాపకార్థం తయారు చేయించిన వాటర్ ట్యాంకర్‌ను చింతమనేని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మరిడి చిట్టిబాబు, వెల్ది రాజారావు, వెల్ది అప్పారావు, జక్కంపూడి ప్రదీప్, పరసా శ్రీను, తళ్లడ శ్రీనివాసరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రమణక్కపేటలో 'మన ఇల్లు- మన గౌరవం'

ప్రజాశక్తి - ముసునూరు

కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలోకి దూసుకెళ్తుందని టిడిపి గ్రామ నాయకులు రంగు వాసు, జనసేన నాయకులు పాశం నాగబాబు అన్నారు. మండలంలోని రమణక్కపేట గ్రామ పంచాయతీ వద్ద ఎఎ ఎస్.మధుమోహన్ ఆధ్వర్యంలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా 2019 గత ప్రభుత్వంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సంబంధించిన నిధులు, విడుదల స్వచ్ఛాంధ్ర కార్యక్రమం, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రంగు ధనలక్ష్మి గాంధీ, కార్యదర్శి ప్రసాద్, టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి రంగు వాసు, టిడిపి నాయకులు అముదాల ఇస్సాకు, ఉప్పే శివ రామకృష్ణ, రంగు మల్లేశ్వరరావు, వేట త్రినాథ్, పటాపంచల శివ, గ్రామ ప్రజలు,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నగరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని కన్యక పరమేశ్వరి సత్రంలో నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రముఖ గుండె వైద్య నిపుణులు వంశీచే ఎంఎల్ఎ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు నగరంలో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నిర్వాహకులు ఆర్యవైశ్య సంఘానికి, కళ్యాణ మండపం కోసం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వాహకులు దివ్వెల జయబాబు మాట్లాడుతూ సంఘ సభ్యుల ప్రోత్సాహంతో ప్రతినెల నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ వంశీ మాట్లాడుతూ గుండెకు సంబంధించిన వివిధ సమస్యల పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ రోజుల్లో ఒక గంట వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఎసిగా గంగా శ్రీదేవి బాధ్యతలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా ఆర్.గంగాశ్రీదేవి బాధ్యతలు చేపట్టారు. విజయవాడ సివి రెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ సత్రం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన నేల సంధ్య నెమలి వేణుగోపాల స్వామి ఆలయానికి బదిలీపై వెళ్లారు.

వణుదుర్రులో డ్రెయినేజీ పూడికతీత పనులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వణుదుర్రు గ్రామంలోని ఎస్‌సి కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీల పూడిక తీత పనులను ఆదివారం పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టారు. డ్రెయినేజీలు చాలా కాలంగా పూడికపోవడంతో వర్షపు నీరు బయటకు పారుదల లేక ఎస్‌సి కాలనీలోనే రోజులు తరబడి నిల్వ ఉంటుంది. నివాసాల ముందే నీరు నిలిచిపోయి కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో గ్రామ సర్పంచి చిన్నం సుగుణ బాబు ఆధ్వర్యంలో డ్రెయినేజీల పూడికతీత చేసి కాలనీ అంతా బ్లీచింగ్ చల్లించి శుభ్రపరిచారు. ఈ పనులను సర్పంచి సుగుణ బాబు పర్యవేక్షించారు.

ప్రమాదకరంగా 11 కెవి విద్యుత్ వైర్లు

ఇంటి పైభాగానే ఉన్న వైనం
పక్కకు జరపాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎంఆర్ అప్పారావు కాలనీలో ప్రధాన రహదారి పక్కన 11 కెవి విద్యుత్ వైర్లు ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్నాయి. ఇంటిపైనే అయిదారు అడుగుల ఎత్తులో ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు, విద్యుత్ అధికారులు స్పందించి ఇంటి పైన ఉన్న విద్యుత్ వైర్లను పక్కకు జరిపి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా చూడాలని కోరుతున్నారు. ఇంటి పైభాగానికి కూడా వెళ్లడంలేదని స్థానికులు చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడే కాకుండా ముందుగానే వైర్లను అధికారులు పరిశీలించి పక్కకు జరిపించాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు. కాలనీలో 20 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నామని, ఈ సమస్యపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి ఇంటిపై భాగంలో ఉన్న 11 కెవి విద్యుత్ వైర్లను పక్కకు జరపాలని కాలనీవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



ఇంటిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలంలో మేజర్ పంచాయతీ అయిన ధర్మాజీగూడెం గ్రామంలో అధ్వానంగా మారిన రహదారి పనులు, యుద్ధప్రాతిపదికన గుంతలకు మరమ్మతులు చేయించారు. ధర్మాజీగూడెం గ్రామం జూనియర్ కళాశాల సమీపంలో చింతలపూడి - ఏలూరు ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక నాయకుల ద్వారా విషయం ఎంఎల్ఎ రోషన్‌కుమార్ తెలుసుకున్నారు. రహదారి మరమ్మతు పనులు గారపాటి నాగ బుద్ధ వరప్రసాద్ పర్యవేక్షణలో (బుజ్జియ్య) చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా చేయని పనులు సొంత నిధులతో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.



రోడ్డుకు మరమ్మతులు

పోలవరం నిర్వాసితులను మోసగిస్తున్న ప్రభుత్వాలు

సిపిఎం

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం నిర్వాసితులను ప్రభుత్వాలు మోసగిస్తునే ఉన్నాయని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్.రాజశేఖర్‌రెడ్డి నుంచి చంద్రబాబు నాయుడు, జగన్మోహన్‌రెడ్డి వరకు అందరూ పోలవరం నిర్వాసితులను మోసగిస్తూనే ఉన్నారన్నారు. ఏళ్ల గడుస్తున్నా పరిహారం ఇవ్వడంలేదన్నారు. పోలవరం నిర్వాసితులకు జంగారెడ్డిగూడెం మండలం చల్లవారిగూడెంలో ప్రభుత్వం పునరావస కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. చల్లవారిగూడెంలో భూములకు, ఇళ్లకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉందని గ్రామసభ సమయంలో అధికారులు పోలవరం నిర్వాసితులకు తెలిపారు. ఇల్లు, స్థలం వద్దనుకుంటే నగదు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మొదటి గ్రామ సభలో అధికారులు చెప్పారు. దీంతో చాలామంది ఇల్లు, స్థలం వద్దని వాటి బదులు నగదు చెల్లించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల కాలంలో కొందరు చింతలపూడి సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో తమ స్థలం, ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సుమారు రూ.పది లక్షల వరకు వాల్యూ వస్తుందని, ఇంటి స్థలం, ఇల్లు వద్దనుకుంటే ప్రభుత్వం మాత్రం రూ.3.85 లక్షలు నిర్ణయించి నిర్వాసితులకు చెల్లిస్తామని ప్రభుత్వం జిఒలో పేర్కొందన్నారు. ఈ విధంగా చూస్తే ప్రతి నిర్వాసితుడు సుమారు రూ.ఆరు లక్షల వరకు నష్టపోతున్నాడన్నారు. చల్లవారిగూడెంలో సుమారు ఆరు గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తుంద న్నారు. ఈ ఆరు గ్రామాల నుంచి ఒక గ్రామంలో సుమారు 150 నుంచి 300 మంది వరకు తమకు ఇంటి స్థలం, ఇల్లు వద్దని నగదు రూపేనా చెల్లించాలని మొదటి గ్రామ సభలో అధికారులకు తెలియజేసి నష్టపోయారన్నారు. మొదటిసారి జరిగిన గ్రామసభలో అధికారులు చల్లవారిగూడెంలో భూములకు రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉందని చెప్పకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. 2017 నుంచి 2024 వరకు సుమారు పది పైనే గ్రామ సభలు అధికారులు ఏర్పాటు చేశార న్నారు. ఏ ఒక్క గ్రామసభలో కూడా అధికారులు చల్లవారిగూడెం లో ఇంటి స్థలానికి, ఇంటికి రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉందని చెప్పకపోవడం వల్ల వందల మంది నిర్వాసితులు సుమారు రూ.ఆరు లక్షల పైనే నష్టపోతున్నారన్నారు. ఇల్లు, స్థలం వద్దన్నవారికి కూడా రిజిస్ట్రేషన్ లెక్క ప్రకారం ప్రభుత్వం రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం రూ.పది లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సుమారు వెయ్యి మంది నిర్వాసితులకు రూ.కోట్లల్లో నష్టం జరుగుతుందన్నారు.

ట్రైకార్ ఛైర్మన్ బొరగానికి టిడిపి నేతల అభినందన

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎపి ట్రైకార్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన టిడిపి పోలవరం కన్వీనర్ బొరగం శ్రీనివాసులును ఆ పార్టీ మండల నాయకులు, ఆయిల్ పామ్ నవభారత్ జంగారెడ్డిగూడెం జోన్ అధ్యక్షులు ఆచంట సూర్య నారాయణ, టిడిపి మండల కార్యదర్శి ఆచంట అనిల్ కుమార్, మక్కినవారిగూడెం సర్పంచి ఎం.గోపాలరావు, పార్టీ నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ట్రైకార్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బొరగం శ్రీనివాస్ ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు పూలబొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. అనంతరం మండలంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీర విధేయుడుకి మంచి గౌరవం దక్కిందన్నారు. ఎంఎల్ఎ టిక్కెట్ త్యాగం చేసిన బొరగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నామినేట్ పదవి కేటాయించి తగిన గుర్తింపు ఇచ్చారన్నారు. మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బొరగం శ్రీనివాస్ చెప్పారని తెలిపారు.



బొరగం శ్రీనివాస్‌ను అభినందిస్తున్న టిడిపి నేతలు

కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు

శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ మెయిన్ వర్కర్స్‌కు ఏడు నెలల జీతాలను తక్షణం చెల్లించాలని శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ మెయింటినెన్స్ యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవాధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. శ్రీసత్యసాయిజి మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ మూడో మహాసభ మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో మార్కెట్ యార్డ్ వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ మహాసభకు సంబంధించిన తీర్మానాలు, నూతన కమిటీ ఎన్నిక తదితర వివరాలను ఆదివారం సిపిఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో దేగా ప్రభాకర్ వివరించారు. ఈ సందర్భంగా దేగా ప్రభాకర్ మాట్లాడుతూ మహాసభ ప్రారంభానికి ముందు కొయ్యలగూడెం పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు ఉత్సాహభరితంగా ర్యాలీ అనంతరం మహాసభలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశామన్నారు. గత ఏడు నెలల నుండి శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ మెయింటినెన్స్ కార్మికులకు జీతాలు లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 200 గ్రామాలకు పైగా గోదావరి జలాలను ఈ పథకం ద్వారా అందిస్తోందని తెలిపారు. ఈ పథకంలో 150 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికులకు పే స్లిప్పులు ఇవ్వాలని, రాత్రిపూట విధి నిర్వహణ చేసే కార్మికులకు టార్చ్ లైట్, షూలను తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిఒ 11 ప్రకారం జీతాలు చెల్లించాలని, సెలవుల్లో కార్మికులు పనిచేస్తే అదనపు అలవెన్స్ చెల్లించాలని తీర్మానం చేశామన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నామన్నారు. శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ మెయింటినెన్స్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా దేగా ప్రభాకర్, అధ్యక్షులుగా జి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఆచంట సత్యనారాయణ, కోశాధికారిగా పిల్లి నాగ వీరబాబు, ఉపాధ్యక్షులుగా బొంత వరప్రసాద్, సిహెచ్.పోసిబాబు, ఉప కార్యదర్శిగా టి.రవీంద్ర, ఎం.శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా డివి.రమేష్, డివి.చారి, పి.సురేష్, అల్లు రాజు, వి.రేగులయ్య, బి.సురేష్, దాసరి రవి, పి.ప్రసాద్, యు.రవికుమార్, సిహెచ్.సత్యనారాయణ ఎన్నుకున్నారు. నూతన కమిటీని దేగా ప్రభాకర్ అభినందించారు. భవిష్యత్తులో కార్మికుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేయాలని, ప్రజా ప్రతినిధి అధికారులు సహకరించాలని కోరారు.

6 నుంచి రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు

ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938-80 సంవత్సరాల ఓక్ జూబ్లీ వేడుకలు, జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభలను ఆదివారం ఎంపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు పి.రత్నంబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు, రాష్ట్ర అకాడమిక్ కమిటీ కన్వీనర్ జి.కృష్ణ పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు మాట్లాడుతూ ఎపిటిఎఫ్ ఆవిర్భవించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంలో అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో విజయనగరంలోని పూల్ బాగ్ రోడ్డులో ఉన్న జె కన్వెన్షన్ మార్చు బాలకృష్ణమ్మ ప్రాంగణంలో జరిగే ఓక్ జూబ్లీ వేడుకలు, 20వ రాష్ట్ర విద్య వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. విద్యా ప్రగతి సమాజ శ్రేయస్సు ఉపాధ్యాయ సంక్షేమం, మహిళా సాధికారత, పెన్షన్లు, నూతన విద్యా విధానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావిధానాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, డిఎలు చెల్లించాలని, సరెండర్ లీవులు, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ తదితర క్లైములు వెంటనే చెల్లించాలని, జిఒ నెంబర్ 117ను రద్దు చేయాలని, నెలవారీ ఉద్యోగోన్నతులు వెంటనే ఇవ్వాలని, ఉపాధ్యాయులపై పని భారంగా ఉన్న వివిధ రకాల యాప్‌లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ప్రాంగణంలో మొక్కలను నాటారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. రాష్ట్ర అకాడమిక్ కమిటీ కన్వీనర్ జి.కృష్ణ, ప్రధానోపాధ్యాయులు, సంఘం నాయకులు జి.ప్రకాష్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రత్నంబాబు, జి.మోహన్‌రావు, జిల్లా గౌరవాధ్యక్షులు జి.రాంబాబు పాల్గొన్నారు.

రేచర్లలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి శ్రీ సాయి రాఘవేంద్ర మెడికల్ షాపు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చింతలపూడి శాఖ సంయుక్తంగా రేచర్లలో ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎ.సత్యనారాయణ, డాక్టర్ కె.అనిల్, డాక్టర్ జి.దీప్తి, డాక్టర్ కె.సురేంద్రబాబు వైద్య పరీక్షలు నిర్వహించారు. సాయి రాఘవేంద్ర మెడికల్ షాప్ యజమాని కె.శ్రీనివాసరావు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. డిఎన్‌రావు పేటకు చెందిన కిడ్నీ పేషెంట్ ఎం.రోశయ్యకు మానవత ద్వారా రూ.ఐదు వేలు, సాయి రాఘవేంద్ర మెడికల్ షాప్ యజమాని కె.శ్రీనివాసరావు రూ.రెండు వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవత గౌరవ డైరెక్టర్ ఎ.సత్యనారాయణ, జిల్లా జాయింట్ సెక్రటరీ పి.సోమశేఖరాచార్యులు, ఛైర్మన్ ఎ.అప్పారావు, కన్వీనర్ అధ్యక్షులు కె.రాజేశ్వరి, కె.నాగచిన్నారావు, కమిటీ సభ్యులు డాక్టర్ కె.సురేంద్రబాబు, ఎన్.అశోక్‌బాబు, ఎ.రాజారావు, కె.రామకృష్ణారెడ్డి, వై.శ్రీనివాసరావు, డి.సురేష్, రేచర్ల సర్పంచి కె.శివరామకృష్ణ, మాజీ సర్పంచి టి.వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు ఏలూరు జిల్లా దెందులూరు మండలం, పోతునూరు గ్రామకాపురస్తులు బెలిగిరి పరమేష్ గారి కుమారుడు **మహేష్ కుమార్** గారి సంజాయిషీపై మీకు తెలుపునది ఏమనగా

నా క్లయింటు యొక్క లింకు డాక్యుమెంటు నెం.**591/1972** లు భీమడోలు **ఎస్.ఆర్.ఓ** లో రిజిష్టర్డు కాబడిన క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్థి డాక్యుమెంట్ **ది.27.09.2024**న లోన్ నిమిత్తం ఏలూరు వెళ్ళుచుండగా కొవ్వలి, పోతునూరు మధ్య కవరు జారిపోవుట చేత పై డాక్యుమెంట్ కనబడ లేదు.కావున పై నెంబరు డాక్యుమెంటు దొరికిన ఎడల క్రింది అడ్రస్సుకు గాని నా క్లయింటు అడ్రస్సుకు గాని యివ్వవలసినదిగా కోరుచున్నారు.

షెడ్యూలు:ఏలూరుజిల్లా, భీమడోలు **ఎస్.ఆర్.ఓ** పోతునూరు గ్రామములో ఆర్.ఎస్.నెం.**267/5**లో **340** చ॥గ॥**స్థలమునకు హద్దులు :**

తూర్పు:గుళ్ళల్లి నాగమణి ఆస్థి, **దక్షిణం :** స్వరాజ్య భవన్ ఆస్థి , **పడమర :** దేవినేని వెంకయ్య చౌదరి ఆస్తి , **ఉత్తరం :** రోడ్

క్లయింటు అడ్రస్సు : బెలిగిరి మహేష్ కుమార్ S/o. పరమేష్, పోతునూరు గ్రామము, దెందులూరు మండలం సెల్ : **9390477999**

B.KUMAR
Advocate, ఏలూరు

In The Court Of The Principal District Judge :: Eluru

I.A.No.441/2024, A.S.No. /2024

Between:

Sirimella Gopi Alias Gopi Venkata Subba Rao

...Petitioner /Appellant

AND

Achanta Madhusudhana Rao

...Respondent /Respondent

TO: Respondent /Respondent:

Achanta Madhusudhana Rao, S/o. Late Satyanarayana, Hindu, Male, Aged 53 Years, Flat No.202, V.V.Satyanarayana Nilayam, 5th Road, Santhi Nagar, Eluru, Eluru Dist., EJCPC.

పై నెంబరు గల ఐ.ఎ.నెం. 441/2024లో రెస్పాండెంటు గారికి ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపినా పుచ్చుకొకుండడా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. కావున పై వారికి ఏమయినా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ది.24-10-2024వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరు కావలెను.** లేనిచో మీ పరోక్షమున తీర్పు చెప్పనబడును.

Sri NEKKARGANTI NARASHIMA RAO
Eluru, Advocates, Eluru.
23-9-24. Cell: 98481 18984

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఏలూరు

I.A.No.588/2022 in I.A.No.567/2019 in O.S.No.524/2019

బిట్వీన్:

షేక్ సున్ని సాహెబ్ (డైడ్) మరియు వగైరాలు

...పిటీషనరు /పిటీషనర్లు /వాదులు

మరియు

అనగాని రాధాకృష్ణ

...రెస్పాండెంటు /రెస్పాండెంటు /ప్రతివాది

TO: రెస్పాండెంటు /ప్రతివాది:

అనగాని రాధాకృష్ణ, తండ్రి: వెంకటేశ్వరరావు, హిందు, పురుషుడు, వ్యాపారం, డో.నెం.3-66, రాముల వారి గుడి ప్రక్కన, గోగుంట రోడ్, వసంతవాడ గ్రామం, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు గ్రంధములో తమరి కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం రెస్పాండెంటు /ప్రతివాదికి ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు పత్రికాముఖముగా ఆర్డరు వేసియున్నారు. ఇందలి రెస్పాండెంటు /ప్రతివాది **ది.13-10-2024వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేనియెడల ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట తమరి సంజాయిషీ తెలుపుకోగలరు.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

కూరపాటి పృధ్వీరాజ్,
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 80198 26216

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఏలూరు

I.A.No.567/2019 in O.S.No.524/2019

బిట్వీన్:

షేక్ సున్ని సాహెబ్ (డైడ్) మరియు వగైరాలు

...పిటీషనరు /పిటీషనర్లు /వాదులు

మరియు

అనగాని రాధాకృష్ణ

...రెస్పాండెంటు /రెస్పాండెంటు /ప్రతివాది

TO: రెస్పాండెంటు /ప్రతివాది:

అనగాని రాధాకృష్ణ, తండ్రి: వెంకటేశ్వరరావు, హిందు, పురుషుడు, వ్యాపారం, డో.నెం.3-66, రాముల వారి గుడి ప్రక్కన, గోగుంట రోడ్, వసంతవాడ గ్రామం, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు గ్రంధములో తమరి కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం రెస్పాండెంటు /ప్రతివాదికి ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు పత్రికాముఖముగా ఆర్డరు వేసియున్నారు. ఇందలి రెస్పాండెంటు /ప్రతివాది **ది.13-10-2024వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేనియెడల ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట తమరి సంజాయిషీ తెలుపుకోగలరు.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

కూరపాటి పృధ్వీరాజ్,
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 80198 26216